ఆహ్లాదం..ఆనందం..ఆరోగ్యం

- పార్కుల అభివృద్ధిపై హర్షాతిరేకాలు
- వీకెండ్‌లో సందడిగా కనిపిస్తోన్న పార్కులు
- వ్యాయామానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రజానీకం


90వవార్డు అల్లూరి పార్కులో వాకింగ్ చేస్తున్న మహిళలు


గ్రీన్ బెల్ట్ పార్కులో వ్యాయామం చేస్తున్న మహిళలు


పాపను ఊయలలో ఊగిస్తున్న తల్లి


వాకింగ్ అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మహిళలు


90వ వార్డు అల్లూరి పార్కులో పిల్లల ఆటలు

విశాఖ విద్య: ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం పంచేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది. దీంతో చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా పార్కులకు ప్రజలు క్యూ కడుతున్నారు. వ్యాయామం చేస్తూనే హాయిగా గడుపుతున్నారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేస్తున్నారు. మహిళలు, వయో వృద్ధులు సైతం పార్కుల బాట పడుతున్నారు. వ్యాయామంతో పాటు కష్టసుఖాలు పంచుకోవడానికి వేదికలవుతున్నాయి. పరిసరాల్లోనే సుందరమైన పార్కులు ఏర్పాటు చేయడంతో ఇళ్లకే పరిమితమైన వారు సతైం సమయం కేటాయించుకుని మరీ పార్కులకు వెళ్తున్నారు. వీకెండ్స్‌లు రద్దీ మరింత పెరుగుతోంది. పచ్చదనంతో పార్కులన్నీ ప్రజానీకానికి ఆహ్లాదరకమైన వాతావరణం అందిస్తున్నాయి.

ఎస్‌ఏడీ ప్రాంతంలో..

విశాఖ నగరంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా ఎస్‌ఏడీ ఏరియా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు సంస్థలు, పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. దీంతో ఉద్యోగ, వ్యాపార,వాణిజ్యరంగాల్లో పనిచేస్తున్న వారి అవసరాలకు అనుగుణంగా ఎస్‌ఏడీ ఏరియాలోని జీవీఎంసీ 52, 90వ వార్డుల్లోని శాంతి నగర్, బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, కరాస, గ్రీన్ బెల్ట్ ఏరియాల్లో పార్కులను అభివృద్ధి చేశారు.

వీకెండ్ జోష్ : విధుల నిర్వహణ,ఇంటి పనుల్లో రోజంతా అలసిన జనం సాయంత్రం వేళ ఉల్లాసంగా గడిపేందుకు పార్కులకు వస్తున్నారు. వీకెండ్ వచ్చిందంటే పిల్లలు, పెద్దలతో పార్కులన్నీ సందడిగా మారుతున్నాయి.

పార్కులు భలే ఉన్నాయి



పార్కులు అభివృద్ధి చేస్తే బాగుంటుందని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. గతంలో ఎవరూ పార్కుల గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు మా వార్డులో పార్కులన్నీ అభివృద్ధి చేశారు. ఆహ్లాకరంగా పార్కులను తీర్చిదిద్దారు. మహిళలకు కూడా ఉపయోగకరంగా ఉండేలా ఏర్పాట్లు చేయడం సంతోషం.

– కె. విజయ వినీత, కాకాని నగర్

ఆహ్లాదకరంగా..



గతంలో కంటే పార్కులు ఎంతో బాగా అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయటం వల్ల రిటైర్ అయిన మా లాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది. పార్కులు అభివృద్ధి చేయటంతో పాటు, వీటి నిర్వహణ కూడా జీవీఎంసీ అధికారులు, కాలనీ అసోసియేషన్ సమన్వయంతో చేపడుతుండడం మంచి పరిణామం. ఎక్కువ కాలం ఉపయోగకరంగా ఉంటాయి.

– చౌడువాడ నాగరాజు, రిటైర్డ్ ఉద్యోగి, పైడిమాంబ కాలనీ

ఆరోగ్య పరిరక్షణ



ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ రోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. అందుబాటులో పార్కులు ఉండటం వల్ల ప్రజలు ఎంతో మేలు జరుగుతుంది. పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుంది. ప్రభుత్వం మంచి ఆలోచనతో ఇలాంటి పనులు చేస్తోంది.

– డాక్టర్ రొంగలి రేవతి, బుచ్చిరాజుపాలెం యుపీహెచ్‌సీ

అందరికీ ఉపయోగపడేలా..



పార్కులను అన్ని వయసుల వారికి ఉపయోగకరంగా ఉండేలా అభివృద్ధి చేశారు. గ్రీన్ బెల్ట్‌ను పార్కుగా అభివృద్ధి చేయాలని మా వాకర్స్ క్లబ్ నుంచి ఎంతో కాలంగా విన్నవిస్తున్నాం. కానీ గతంలో ఎవరూ పట్టించుకోలేదు. ఇన్నాళ్లకు గ్రీన్ బెల్ట్‌ను సర్వాంగా సుందరంగా తయారు చేశారు. ఓపెన్‌జిమ్, వాకింగ్ ట్రాక్ ఇలా అన్ని ఏర్పాట్లు చేశారు. చాలా సంతోషంగా ఉంది.

– డి. లక్ష్మణరావు, వాకర్స్ క్లబ్ కోశాధికారి, వుడా కాలనీ

ధ్యానంపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: భగవాన్ పితామహ పత్రీజీ ఆశీస్సులతో శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. 60వ వార్డు గుల్లలపాలెంలో ఆదివారం పత్రీజీ పిరమిడ్ స్పిరుచవల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ మాట్లాడారు. నిత్యం శాకాహారం భుజించడం ఆరోగ్యానికి శ్రేయస్కరం అన్నారు. రోజూ ధ్యానం చేస్తూ ఆరోగ్య కరమైన ఆహారం తీసుకుంటూ ఉంటే మనిషి ప్రకాశవతంగా ఉంటాడన్నారు. ఈ సందర్భంగా శ్రీహరిపురం నుంచి జవహర్‌నగర్ వరకు ధ్యానంపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివగణేశ్వరరావు,రేవతిదేవి,భాగ్యగౌరి,జయలక్ష్మి,బాలజీ,సుబ్రమణ్యంరాజు,కనకరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా జెండాలు వాహనదారులకు ఇబ్బందులు


ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌పై కట్టిన జెండాలు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌పై టీడీపీ జెండాలు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. నారా లోకేష్ పర్యటన పేరిట టీడీపీ నాయకులు హడావుడి కారణంగా ఫ్లై ఓవర్ పై వాహనాల ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. హైవేపై బిర్లా జంక్షన్ నుంచి గాజువాక, పెందర్తి వైపు వెళ్లే వాహనాలకు జెండాల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని రీతిలో టీడీపీ నాయకులు జెండాలు కట్టారు. తాము తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కోదండ రామస్వామిని దర్శించుకున్న 'ఆడారి'


కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: బాజీ జంక్షన్‌లోని కోదండరామస్వామి ఆలయంలో స్వామిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, గేదెల మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా బల్లల పండగ


బల్లపండగలో పాల్గొన్న రేణుకా గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ రజకుల కాలనీలో ఆదివారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకాగోపాలకృష్ణ పాల్గొన్నారు. సంప్రదాయబద్ధ పూజల్లో పాల్గొన్నారు. వారికి పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ


రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింథియా: ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

చదవని పుస్తకాలను డొనేట్ చేయండి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ వెలగా వెంకటప్పయ్య 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక పురస్కారాన్ని ఉండ్రాజవరం గ్రంథపాలకుడు నున్నవెంకట రామారావుకు ఆచార్య పి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అండర్ సీఎస్ఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ పుస్తకాన్ని చదువుతుంటే వచ్చే ఆనందం.. మొబైల్, కంప్యూటర్స్‌లో చదివితే రాదన్నారు. చదవకుండా ఉన్న పుస్తకాలను బుక్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. వెలగా ర్వోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి


ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్,రేవళ్ల సత్యనారాయణ

మల్కాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ చెప్పారు. గతంలో కనీసం ప్రగతికి నోచుకోని ప్రాంతాల్లో సైతం మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్ మెన్‌కాలనీలో సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు,సీసీ మెట్ల మార్గం,సీసీ కాలువలను ఆదివారం ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చినప్పుడు వార్డు కార్పొరేటర్ పూర్ణశ్రీ, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ స్థానిక సమస్యలను తన దృష్టికి తెచ్చారన్నారు. వాటిపై జీవీఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి మూడు నెలల వ్యవధిలో ఇక్కడ సీసీ రోడ్డు,కొండపైకి సీసీ మెట్ల మార్గం,సీసీ కాలువ పనులను పూర్తి చేయించామన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, స్థానిక నాయకులు పెంటారావు,అప్పారావు,పైడిరాజు,కాకి గౌరి,బంగారాజు,నాగూర్,భరత్,గీతిక,త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు తళ తళ

మిలాన్ నేపథ్యంలో ముస్తాబు


నౌసేనబాగ్ నుంచి మల్కాపురం వరకు వేస్తున్న బీటీ రోడ్డు

మల్కాపురం: మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న రోడ్లు కళకళలాడుతున్నాయి. మిలాన్ నేపథ్యంలో రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చి అదనపు హంగులు అద్దుతున్నారు. దీంతో రోడ్లతో పాటు ఫుట్ పాత్‌లు మిలమిల మెరుస్తున్నాయి. మిలాన్ విన్యాసాలకు వివిధ దేశాల నుంచి అతిథులు రానున్న నేపథ్యంలో అందంగా తీర్చిదిద్దుతున్నారు. సుమారు రూ.1.30 కోట్లతో సర్వీసు రోడ్డుతో పాటు ఇరువైపులా గల ఫుట్‌పాత్‌లను ఆధునికీకరిస్తున్నారు. కొత్త హంగులు దిద్దుకోవడంతో పాదచారులు,వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నేవల్ స్కూల్ వద్ద ఆకర్షణీయంగా ఫుట్‌పాత్


నేవల్ కోస్టుగార్డు సర్వీసు రోడ్డులో రంగులు వేసిన దృశ్యం

ప్రజా సంకల్పానికి కేంద్రం తలవంచక తప్పదు



దీక్షలో పాల్గొని నినాదాలు చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం పోరాటాల పురిటి గడ్డ విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న 1102వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకొచ్చినా అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కుర్తాళం పీఠాధిపతికి ఘన స్వాగతం


సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతంపేట: అమృతోత్సవం పేరిట నిర్వహిస్తున్న శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి వచ్చారు. కుర్తాళం నుంచి వచ్చిన స్వామీజీ, శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతీ స్వామినిలకు పీఠం వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దారి పొడుగునా పూలతో ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు పీఠాధిపతి సమక్షంలో అమృతోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: నగర కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ వెంకటరావు(స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ మెయిన్ గేటు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అట్లగూన గ్రామం అరకుకు చెందిన పంగి గోపినాథ్ అనే యువకుడు అరకు నుంచి బెంగుళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ భరత్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. నాలుగు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు


సీఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న ఉద్యోగి జయరాజు


అవార్డు అందుకుంటున్న వైద్యురాలు సుజాత

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 105 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను ప్రధానం చేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో నెహ్రూ అవార్డులు అందజేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఉక్కునగరం ఎంపీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ చేతుల మీదుగా 56 మంది అధికారులు, 49 మంది కార్మికులు అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డీకే మొహంతి, బాగ్చీ, ఎస్.సి.పాండేతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.34,700 నగదు స్వాధీనం

సీతమ్మధార: ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఐదుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో గల ఒక ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ పేకాటాడుతున్న కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన కడగల రామకృష్ణ, గాజువాక కర్ణవానిపాలేనికి చెందిన ఎస్.భీమరాజు, తాటిచెట్లపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వెనుక వీధికి చెందిన వేకి శ్రీనివాసరావు, కంచరపాలెం గజపతినగర్‌కు చెందిన బోరులపల్లి శ్రీనివాసరావు, దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన రఘుమండ మోహన్‌రావులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.34,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భారత సంస్కృతి, నాగరికతపై అవగాహన అవసరం


డాక్టర్ వామదేవ శాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ: పాశ్చాత్య దేశాలు విశ్వసిస్తున్న భారతదేశ సంస్కృతి, నాగరికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పండిట్ వామదేవ శాస్త్రి సూచించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత'అంశంపై రెండు రోజుల సింపోజియంను ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం వేదికగా నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి పండిట్ వామదేవ శాస్త్రి మాట్లాడుతూ భారతదేశం గొప్ప, సజీవమైన నాగరికతను కలిగి ఉందన్నారు. చాలా మంది పాశ్చాత్య చరిత్రకారులు భారత సంస్కృతిని వక్రీకరించి రాశారన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ భారత చరిత్రకారులు రాసిన మనదేశ చరిత్ర కొంత మేర వెలుగులోకి రాలేదన్నారు.